క్లుప్తంగా

కరెంటు ఉండని ప్రాంతాలు

కాప్రా: కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్, రుక్మిణీపురం ఫీడర్లలో పలు కాలనీలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు శ్రీరాంనగర్, గాంధీనగర్, శ్రీనివాస నగర్, ఆదిత్యనగర్, బృందావన్ కాలనీ, అరుల్ కాలనీ, లక్ష్మీపురంలో కరెంటు ఉండదన్నారు.

మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్లాపూర్: మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 8 ఫీడర్లలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ క్రిష్టయ్య తెలిపారు. గోకుల్‌నగర్, బాబానగర్, శక్తిసాయినగర్, సూర్యనగర్, చాణిక్యపురి, వెంకటరమణ కాలనీ, ఎస్వీనగర్, కెఎల్ రెడ్డినగర్, భవానీనగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, నాగలక్ష్మీనగర్, న్యూనర్సింహనగర్, సాయి టవర్స్, తిరుమల మిలీనియం, లక్ష్మీనగర్, గుల్మోర్ గార్డెన్స్, న్యూ భవానీనగర్, ఐడీఏ మల్లాపూర్, సాయినగర్‌సీలో కరెంటు ఉండదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక సాయం కోసం 26 డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డిని సంప్రదించగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పి.రేణుకకు రూ.30 వేలు, ఎస్.రమేష్‌రెడ్డి రూ.27 వేలు, ఏ.శ్రీశైలం రూ.11 వేల చెక్కులను మంజూరు చేయించి సోమవారం బాధితులకు అందజేశారు.

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశాలు

మౌలాలి: మౌలాలిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ సనత్‌నగర్ బాలికల-1 స్కూల్, కళాశాలలో 5 నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో చేరేందుకు మైనార్టీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్లు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు అందజేయాలన్నారు. ఫోన్: 79950 57901.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: అభయాంజనేయ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి బీఆర్‌ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి సోమవారం రూ.1.35 లక్షల విరాళాన్ని దేవాలయ ఈవో భాగ్యలక్ష్మీ, మేనేజర్ శ్రీనివాస్ శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నేమూరి మహేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, జగన్ ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న పోకల నిర్మల

మల్లాపూర్: మున్నూరు కాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా మల్లాపూర్ భవానీనగర్‌కు చెందిన పోకల నిర్మల రఘు పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండదేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్ పటేల్ నియామక పత్రాన్ని నిర్మలకు అందజేశారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వైఎస్సార్ టీపీలో చేరికలు



వైఎస్‌ఆర్‌టీపీలో చేరుతున్న మహిళలు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ బృందావన్ పార్కులో సోమవారం వైఎస్ షర్మిల అధ్యక్షతన వైఎస్‌ఆర్‌టీపీలో మేడ్చల్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొండ అప్పారావు, ఉప్పల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మల్లెపూవు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు వైఎస్‌ఆర్‌టీపీలో చేరారు. నేతలు మాట్లాడుతూ రాజన్న సంక్షేమ రాజ్యం తెలంగాణలో రావాలంటే ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

హబ్సిగూడ: పేదల సంక్షేమానికి పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఉప్పల్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. పార్టీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి తోఫిక్, నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, రంజిత్‌రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, భిక్షపతి, సురేందర్, కంది శ్రవణ్‌రెడ్డి, ఆకారపు అరుణ్ సమక్షంలో హబ్సిగూడ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జాబితాను అధిష్టానానికి పంపించామని, ఆమోదం అనంతరం అధికారికంగా ప్రకటిస్తామన్నారు.

స్వచ్ఛతే లక్ష్యం..

నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం..

- రోడ్లపై చెత్త వేస్తే రూ.50 వేల వరకు జరిమానా
- ఇప్పటికే అన్ని రకాలుగా ప్రచారం చేశాం
- అయినా పట్టకపోతే చట్టపరమైన చర్యలు
- ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణ కుమారి



చెత్త వేయవద్దని వీధుల్లో డప్పు కొడుతూ ప్రచారం చేస్తున్న ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు(ఫైల్)

ఉప్పల్: రోడ్లపై వ్యర్థాలు, చెత్త, బిల్డింగ్ మెటీరియల్ వేస్తే రూ.50 వేల వరకు జీహెచ్ఎంసీ అధికారులు జరిమానా విధించనున్నారు. ఇప్పటికే చర్యలకు ఉపక్రమించారు. మొదట భవన నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోనున్నారు. ఇంట్లోని వ్యర్థాలు స్వచ్ఛ కార్మికులకు ఇవ్వకుండా రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వేసే వారిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే కరపత్రాలు, ఆటోల్లో ప్రచారం, కాలనీ అసోసియేషన్లు అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు, విద్యార్థుల సహకారంతో విశ్వనగరంగా తీర్చేందుకు సిద్ధమవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి స్వచ్ఛ టాయిలెట్స్ నిర్మించారు. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే భారీ జరిమానా విధించనున్నారు.

తడిపొడి చెత్త వేర్వేరుగా అందజేయాలి

తడి పొడి చెత్తను స్వచ్ఛ సేవకులు వేరు చేసి ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందాలంటే జీహెచ్ఎంసీ అధికారులతో పాటు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిస్తున్నారు.

వ్యాపారస్తులకు ప్రత్యేక బిన్స్

చెత్త సేకరించేందుకు వీలుగా వ్యాపారస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తడిపొడి చెత్తకు వేర్వేరు బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని, జమ చేసిన చెత్తను స్వచ్ఛ సేవకులకు మాత్రమే అందజేయాలని సూచిస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి 18001201159కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వారు తగిన రుసుము నిర్ణయించి వ్యర్థాలను తొలగిస్తారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో దాదాపుగా 500 వరకు పారిశుధ్య విభాగంలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. జవాన్లు 9 మంది, ఎస్ఎఫ్ఐలు 22 మంది వరకు పని చేస్తున్నారు.

చెత్త వేస్తే జరిమానా



తెలిసీ తెలియక కొందరు రోడ్ల పక్కనే భవన నిర్మాణ వ్యర్థాలు, డెబ్రీస్‌ను పడేసి వెళ్తుంటారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించేది లేదు. కొందరు ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తను పడేస్తుంటారు. అది కూడా తీవ్ర నేరంగా పరిగణిస్తాం. ఇప్పటికే దాదాపు చాలా వరకు నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ జరిమానాలు విధించాం. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.

– అరుణ కుమారి, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్

పనుల్లో నాణ్యత పాటించండి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామారావు, నాయకులు వెంకటేష్, చెట్ల రవి, అరవింద్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌ను మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



కార్పొరేటర్‌ను గీతను సన్మానిస్తున్న చిలుకానగర్ కాలనీ సంఘాలు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. డివిజన్ పరిధిలో హిందూ శ్మశానవాటికను మోడల్ శ్మశానవాటికగా రూపొందించేందుకు రూ.3 కోట్ల నిధులను తీసుకువచ్చినందుకు సోమవారం డివిజన్‌లోని వివిధ కాలనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ సంఘాల సహకారంతోనే డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వీబీ నర్సింహ, ఏదుల కొండల్‌రెడ్డి, జగన్, బొల్ల లక్ష్మణ్, రామ్‌చందర్ స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు షురూ..



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ న్యూ మారుతీనగర్‌లో రూ.55 లక్షలతో నిర్మించే పైపులైన్ పనులను సోమవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మోహన్‌గౌడ్, ఐఎస్.రావు, కిరణ్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, సాయిబాబు, శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రమణనాయుడు, జాంగీర్, మహేష్, నటరాజ్, రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



హబ్సిగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతనహరీష్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

– ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: మహేశ్వరినగర్ కాలనీ స్వాతి టిఫిన్స్ సెంటర్ సమీపంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే ఏజెండాగా తీసుకొని రాజకీయాలకు తావులేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డీఈ నాగమణి, ఏఈ సాయికిరణ్, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, డాక్టర్ బీవీ.చారి, సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ, శివ, లింగానాయక్, రాజు, శేఖర్‌రెడ్డి, యాదమ్మ, నళినిరెడ్డి, ధనలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, బీజేపీ నాయకులు సంజయ్ పటేల్, సుమన్‌రావు, రవి, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీను, కాలనీవాసులు అరవిందరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నర్సింహరెడ్డి, తిరుపతయ్య, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేద్దాం

హబ్సిగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కంటి వెలుగు నిర్వహించే వివరాలను ముందుగానే ఆయా ప్రాంతాల ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. క్యాంపులు నిర్వహించే చోట అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నారాయణరావు, డాక్టర్లు సౌందర్యలత, మౌనిక, మంజుల, రమాదేవి, మాధవి, వైద్య నిర్వహణ సిబ్బంది గొంగడయ్య, శ్యామలమ్మ, రాజశేఖర్, శ్యాంసుందర్, పద్మ, అధికారులు పాల్గొన్నారు.

వెంటనే సమస్యకు పరిష్కారం



డ్రైనేజీకి మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్ అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం బాలాజీ హిల్స్ కాలనీ మెయిన్‌రోడ్డులో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బాలాజీ హిల్స్ కాలనీ అధ్యక్షులు ధర్మానాయక్, నాయకులు పి.వి.సురేష్, వార్డు ఆఫీసర్ షాన్బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా బండారి బాబు



కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా కాప్రాకు చెందిన బండారి బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్, జీహెచ్ఎంసీ కన్వీనర్స్ కమలాకర్, తోటకూర శ్రీకాంత్‌ల చేతులమీదుగా బండారి బాబు నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం ఎందుకు..?



డీసీ వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అల్వాల్ ఉపకమిషనర్‌ను బీజేపీ నాయకులు కోరారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఉపకమిషనర్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఓల్డ్ అల్వాల్ నుంచి ఐస్ ఫ్యాక్టరీకి వెళ్లే రహదారి, కొకూర్ ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయని, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్ల వేసేందుకు నిధులు మంజూరైనట్లు ప్రకటించినా నేటికీ పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా రోడ్లు వేయాలన్నారు. లేదంటే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్, బీజేపీ నాయకులు దండుగుల వెంకటేష్, ప్రకాష్ చౌదరి, గోపు రమణారెడ్డి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తంగిరాల జేమ్స్‌కు కాంస్యం



విద్యార్థి తంగిరాల జేమ్స్ నోబుల్

ఉప్పల్: జాతీయ స్థాయి బృంద సంగీత పోటీల్లో ఉప్పల్‌కు చెందిన విద్యార్థి తంగిరాల జేమ్స్ నోబుల్‌కు కాంస్యం లభించింది. ముంబైలో జరిగిన జాతీయ స్థాయి బృంద సంగీత పోటీల్లో జేమ్స్ నోబుల్ రన్నరప్‌గా నిలిచి కాంస్య పతకం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సికింద్రాబాద్ మారేడుపల్లి సెయింట్ ఆండ్రూస్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి వారి బృందం ఇటీవల నగరంలో జరిగిన రీజనల్ స్థాయిలో ఫైనల్‌కు చేరుకున్నాడు. ముంబైలో జాతీయ అంతర్ పాఠశాలల సంగీత పోటీల్లో కాంస్యం సొంతం చేసుకోవడంతో పలువురు అభినందించారు.

బీఎస్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్



రమేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

ఉప్పల్: బహుజన సాహిత్య అకాడమి(బీఎస్‌ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిలుకానగర్ డివిజన్ సీతారామ కాలనీకి చెందిన జి.రమేష్‌ను నియమిస్తూ ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. త్వరలో రాష్ట్రస్థాయిలో అన్ని కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాహిత్యకారులు, ఉద్యమకారులను ప్రోత్సహించేందుకు సంస్థను మరింత విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 12వ తేదీన తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ సౌత్ ఇండియా ఆరో కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఎర్రకుంట శ్మశానవాటికను అభివృద్ధి చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: ఈస్ట్‌జోనల్ కమిషనర్ పంకజను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ సోమవారం కలిశారు. నాచారం ఎర్రకుంటలోని హిందూ శ్మశానవాటికను వైకుంఠ ధామంగా తీర్చిదిద్దాలని కమిషనర్‌ను కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నిధులు మంజూరు చేయాలన్నారు. పటేల్‌కుంట చెరువు గుర్రపు డెక్క తొలగించేందుకు సిబ్బందిని, రైతుబజార్‌లో మల్టీఫంక్షన్ హాల్‌ను నిర్మించాలని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ ఎస్ఈ అశోక్‌రెడ్డి తదితరులున్నారు.





జనప్రియ టౌన్‌షిప్ సమస్యలపై పోరాటం ఆగదు



జీహెచ్ఎంసీ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

మల్లాపూర్: మల్లాపూర్ జనప్రియ టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలపై పోరాటం ఆగదని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం టౌన్‌షిప్‌ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు తప్ప టౌన్‌షిప్‌లో మళ్లీ రోడ్లు వేయలేదన్నారు. ఓపెన్ నాలాను డైవర్ట్ చేయాలని సూచించారు. అదేవిధంగా చిల్డ్రన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓ నాయకుడు నాలాను ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తే జీహెచ్ఎంసీ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ అధ్యక్షుడు శ్రీమన్నారయణ, కాంగ్రెస్ నేత నెమలి అనిల్ తదితరులు ఉన్నారు.

ప్రగతిపథంలో దూసుకెళ్తున్న పారిశ్రామికరంగం

కుషాయిగూడ: రాష్ట్రంలో పారిశ్రామికరంగం ప్రగతిపథంలో దూసుకెళ్తోందని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. కాప్రా చిన్న తరహా సూక్ష్మ పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపాస్ ఏర్పాటుతో పారిశ్రామికరంగంలో విప్లవాత్మక మార్పునకు నాంది పలికిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాయితీలను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, కాప్రా చిన్న తరహా సూక్ష్మ పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు ఎం.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులు మోహన్‌సిద్ధూ, మస్తాన్, చెంచురెడ్డి, బాలరాజు, కేవీఆర్ రెడ్డి, మధుసూదన్ చారి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు



వెంకటాపురంలో పర్యటిస్తున్న విద్యుత్ శాఖ ఏడీఈ నాగరాజు

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లో కరెంట్ లో వోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏడీఈ నాగరాజు అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటాపురం, వెంకటేశ్వరనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. లో వోల్టేజీ సమస్యను గుర్తించి పాత ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి వాటి స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, ఈఎస్.లక్ష్మణ్, రాజేష్‌గౌడ్, సురేష్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దేవేందర్‌నగర్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన దేవేందర్‌నగర్ నూతన కమిటీ

బోడుప్పల్: దేవేందర్‌నగర్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దుప్పెల్లి భగవంతులు, ప్రధాన కార్యదర్శిగా మరాటి మల్లేష్, కోశాధికారిగా దయ్యాల మహేష్, ఉపాధ్యక్షులుగా బోడగల్ల సదానంద్, మాల కిష్టయ్య, ముఖ్య సలహాదారులుగా తొంట నర్సమ్మ, వాసూరి ఉప్పలయ్య, జెన్న ధర్మయ్య, సంయుక్త కార్యదర్శులు జోగు సుధాకర్, గాదరి ఆరోగ్యం, తాటికాయల యాదగిరి, సాంస్కృతిక కార్యదర్శులుగా మొగిలిపాక శంకర్ తదితరులు ఎన్నికయ్యారు.

చర్లపల్లి జైలును సందర్శించిన సివిల్ జడ్జిల బృందం

కుషాయిగూడ: తెలంగాణ న్యాయశాఖకు చెందిన జూనియర్ జడ్జిల బృందం సోమవారం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించింది. శిక్షణలో భాగంగా వారు సందర్శనకు వచ్చినట్లు జైలు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జైలు పనితీరు, అన్నపూర్ణ, ఆసుపత్రి, బ్యారక్‌లను పరిశీలించారు. ఖైదీల సంక్షేమం కోసం జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలు, జైలులో పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తులపై జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు ఉప పర్యవేక్షణాధికారి కృష్ణమూర్తి, శశికాంత్, జైలర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి ఎఫెక్ట్



శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

పారిశుధ్య పనులు షురూ..

రామంతాపూర్: నేతాజీనగర్‌లోని హిందూ శ్మశానవాటిక చెత్తాచెదారంతో నిండిపోయి అస్తవ్యస్తంగా మారి అంత్యక్రియలకు వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతనెల 27న సాక్షిలో వచ్చిన కథనానికి జీహెచ్ఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది శ్మశానంలో పేరుకుపోయిన చెత్తను సోమవారం శుభ్రం చేశారు.